క్లుప్తంగా...

వీధి కుక్కల సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయండి

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వీధి కుక్కలతో ఎలాంటి సమస్యలు ఉన్నా బ్లూక్రాస్ టీమ్ సభ్యులకు ఫిర్యాదు చేయాలని కార్పొరేషన్ అధికారులు వెల్లడించారు. కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్‌లలో వీధి క్కులపై బ్లూ క్రాస్ టీం సభ్యులు సర్వే చేపట్టారన్నారు. మొత్తం 537 వీధి కుక్కలను గుర్తించామన్నారు. కుక్కల సమస్యలకు బ్లూ క్రాస్ టీం సభ్యులు శ్రీధర్ 91211 06515ను సంప్రదించాలని కోరారు.

నేడు ఉప్పర్‌పల్లిలో డ్రైనేజీ పైపులైన్ శంకుస్థాపన

రాజేంద్రనగర్: అభివృద్ధి పనుల్లో ప్రజలంగా భాగస్వాములు కావాలని రాజేంద్రనగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పోరెడ్డి ధర్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి పలుగుచెరువు మహేష్‌లు వెల్లడించారు. రాజేంద్రనగర్ డివిజన్ ఉప్పర్‌పల్లి కోర్టు ప్రాంతంలో బుధవారం నూతన డ్రైనేజీ పైపులైన్ శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్, కార్పొరేటర్ అర్చనజయప్రకాష్‌లు హాజరుకానున్నారన్నారు.

మియాపూర్- నార్సింగి బస్సు నంబర్ 221

- ప్రతి 15 నిమిషాలకో బస్సు

రాయదుర్గం: మియాపూర్ మెట్రో స్టేషన్ నుంచి నార్సింగికి బస్సులు వేశామని గచ్చిబౌలి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ ఆర్టీసీ డిపో మేనేజర్ పి శ్రీనివాస్ మంగళవారం తెలిపారు.ఈ రూట్‌లో నాలుగు మెట్రో బస్సులు, మరో నాలుగు ఆర్డినరీ బస్సులు నడుస్తాయని, బస్సు నంబర్ 221 అని తెలిపారు. ప్రతి 15 నిమిషాలకు ఒక బస్సు ఉంటుందని ..మియాపూర్ మెట్రో స్టేషన్ నుంచి మొదటి బస్సు ఉదయం 6.25 గంటలకు, చివరి బస్సు రాత్రి 7.30 గంటలకు బయలుదేరతాయన్నారు. నార్సింగి నుంచి మొదటి బస్సు ఉదయం 7.20 గంటలకు బయలుదేరుతుందని, చివరి బస్సు రాత్రి 8.25 గంటలకు బయలుదేరుతుందన్నారు. ఈ రూట్‌లో మియాపూర్ మెట్రో స్టేషన్‌లో ప్రారంభమయ్యే ఆర్టీసీ బస్సులు ఆల్విన్‌క్రాస్‌రోడ్డు, హఫీజ్‌పేట్, కొండాపూర్, గచ్చిబౌలి కూడలి, కోకాపేట్, కోకాపేట్ క్రాస్‌రోడ్డు మీదుగా నార్సింగి వరకు నడుస్తాయన్నారు. కాలనీ, బస్తీల నుంచి మెట్రో స్టేషన్లకు బస్సు సౌకర్యం కల్పించేందుకు ఈ రూట్‌లో వేశామని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలి



మ్యాన్ హోల్ సమస్యను పరిశీలిస్తున్న అధికారులు, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: భూగర్భ డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటామని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి పేర్కొన్నారు. గోపన్‌పల్లిలో స్థానికులతో కలిసి పర్యటించారు. ప్రధానరోడ్డుపై డ్రైనేజీ మ్యాన్ హోల్ లీకేజీలను పరిశీలించి సమస్యను పరిష్కరింపచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్న వర్షానికే నగరంలో పలు చోట్ల మురుగు, రోడ్లపైకి వరద నీరు చేరి నానా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. వర్షాకాలం ఆరంభమయ్యే లోగా నిర్మాణ పనులన్నీ పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం నారాయణ, మేనేజర్ అభిషేక్‌రెడ్డి, నాయకులు దయాకర్, రంగస్వామి, ముర్గా,సురేష్, స్థానికులు పాల్గొన్నారు.

గోల్కొండ ఏరియా ఆస్పత్రికి అవార్డు

గోల్కొండ: ఎయిడ్స్, హెచ్ఐవీ పరీక్షలు అత్యుత్తమంగా నిర్వహించినందుకు గోల్కొండ ఏరియా ఆస్పత్రికి అత్యుత్తమ నాణ్యతాప్రమాణాలు పాటించే దవాఖానాను కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ మేరకు మంగళవారం కేంద్ర ప్రభుత్వం నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ వారు మంగళవారం గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో జరిగిన కార్యక్రమం ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మజహర్ ఉల్లా మాట్లాడుతూ... వైద్యులు, నర్సింగ్ సిబ్బందితో పాటు ల్యాబ్ టెక్నీషియన్ వారి సహకారంతో హెచ్ఐవీ పరీక్షలు విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. అంతేకాకుండా ఆస్పత్రిలో శానిటైజేషన్‌పై ప్రత్యేక టీంను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నామన్నారు. హెచ్ఐవీ పరీక్షలకు వచ్చే వారు నిర్భయంగా పరీక్షలు చేసుకునేలా వారికి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని అన్నారు. హెచ్ఐవీ పాజిటివ్ వచ్చినా కూడా వారిలో ధైర్యం నింపుతున్నామని ఆయన అన్నారు. ఇటువంటి అవార్డు తమ ఆస్పత్రి రావడం అభినందనీయమన్నారు. ఆ అవార్డు సాధించటానికి ఆస్పత్రి టీం వర్క్‌దే ప్రధాన పాత్ర అయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ఆర్ఎంఓ, డాక్టర్ రవూఫ్ ఉద్దీన్, ఏఓడాక్టర్ శ్రీనివాసరావు, కౌన్సిలర్స్ బి. దిలీప్‌కుమార్, రవికుమార్, ల్యాబ్ టెక్నీషియన్ కుమార్ పాల్గొన్నారు.

రహదారి.. గోదారి



లెమన్ ట్రీ హోటల్ జంక్షన్‌లో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్

- వరదకు దారేది..?
- తప్పని ట్రాఫిక్ చిక్కులు

గచ్చిబౌలి: వర్షం వస్తే ఐటీ కారిడార్‌లో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించిపోతోంది. రోడ్లపైన వరద నీటితో ట్రాఫిక్ చిక్కులు తప్పడం లేదు. నీటిని వెంటనే తొలగించే పరిస్థితి లేకపోవడంతో ట్రాఫిక్‌లో వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. గచ్చిబౌలి, మాదాపూర్, రాయదుర్గం, మియాపూర్ , చందానగర్, శేరిలింగంపల్లి తదితర ప్రాంతాలలో వాటర్ లాగింగ్ పాయింట్లు చెరువులను తలపిస్తున్నాయి. అడుగడుగునా ట్రాఫిక్ జామ్‌లు నెలకొంటున్నాయి. వరద నీటి ప్రవాహానికి దారి లేకపోవడం, రోడ్ల ప్రణాళికలో లోపాల కారణంగా కొన్ని సంవత్సరాలుగా వాటర్ లాగింగ్ పాయింట్లకు పరిష్కారం లభించడంలేదు.

లాగింగ్ పాయింట్లు ఇవే..

మాదాపూర్ ట్రాఫిక్ పీఎస్ పరిధిలోని శిల్పారామం, లెమన్ ట్రీ హోటల్, నెక్టార్ గార్డెన్, సిటీ వైన్స్, పర్వత్‌నగర్, గచ్చిబౌలి ట్రాఫిక్ పీఎస్ పరిధిలో డీఎల్ఎఫ్ రోడ్, గమన్ హస్పిటల్, నానక్‌రాంగూడ రోటరీ, రాడిసన్ హోటల్, ఆర్బర్ ఇంటర్నేషనల్ స్కూల్, రాయదుర్గం ట్రాఫిక్ పీఎస్ పరిధిలోని బయోడైవర్సిటీ జంక్షన్, ఐకియా గేట్ నంబర్-1, ఖాజాగూడ, మియాపూర్ ట్రాఫిక్ పీఎస్ పరిధిలోని లింగంపల్లి ఆర్ఓబీ, హఫీజ్‌పేట్ ఆర్ఓబీ, రామకృష్ణానగర్ తదితర ప్రాంతాలలో వర్షం వస్తే రోడ్లు జలమయమవుతున్నాయి.

కిలోమీటర్ల మేర ట్రాఫిక్

ఐటీ ఉద్యోగులు 90 శాతం మంది కార్యాలయాలకు వస్తున్నారు. మాదాపూర్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని ఐటీ కంపెనీలకు లక్షలాది మంది ఉద్యోగులు రాకపోకలు సాగిస్తున్నారు. కొద్దిపాటి అంతరాయానికే కిలోమీటర్ల పొడవునా ట్రాఫిక్ స్తంభించిపోతోంది. ఆదివారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద భారీగా నీరు నిలిచిపోతుండడంతో రాకపోకలు ఆగిపోయాయి. దీంతో పటాన్‌చెరు, ఆర్సీపురం, బీహెచ్ఈఎల్ నుంచి గచ్చిబౌలి, కొండాపూర్ వైపు వెళ్లే వాహనదారులు నల్లగండ్ల ఫ్లైఓవర్ మీదుగా వెళుతున్నారు. నెక్టార్ గార్డెన్, శిల్పారామం, బయోడైవర్సిటీ, లెమన్ ట్రీ వద్ద వరద నీటితో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కల్గుతోంది.

తాత్కాలిక చర్యలే..

జీహెచ్ఎంసీ డీఆర్ఎఫ్ బృందాలు, వరద నీటిని తొలగిస్తున్నా అవి తాత్కాలిక చర్యలుగానే మిగిలిపోతున్నాయి. వరద నీటిని తొలగించినా వాటర్ లాగింగ్ పాయింట్లు అలానే ఉండిపోతున్నాయి. జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు, ఇతర విభాగాల అధికారులు సమన్వయ సమావేశాలు నిర్వహించినా వరద నీటికి పరిష్కారం లభించడం లేదు. వరద నీరు నాలాల్లోకి చేరే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వర్షం .. రోడ్లపైకి పోలీసులు

వర్షం వచ్చిందంటే ట్రాఫిక్ పోలీసులకు కంటి మీద కునుకు ఉండటం లేదు. వర్షంలోనే వాటర్ లాగింగ్ పాయింట్ల వద్దకు చేరుకొని డీఆర్ఎఫ్ బృందాలకు సమాచారం ఇవ్వడంతో బాటు సహకారం అందిస్తున్నారు. ఒకవైపు వరద తొలగింపు, మరోవైపు ట్రాఫిక్ క్రమబద్ధీకరణ పోలీసులకు పెద్ద సవాల్‌గా మారుతోంది. భారీ వర్షం వస్తే ట్రాఫిక్ పోలీసులతో పాటు లా అండ్ ఆర్డర్ పోలీసులు రోడ్లపైన ఉంటున్నారు.



లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద భారీగా నిలిచిన వరద నీరు



గచ్చిబౌలి గమన్ ఆస్పత్రి వద్ద ..

శ్రీవారి ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

బండ్లగూడ: దేవాలయాల్లో దైవచింతనతో పాటు మానసిక ప్రశాంతతతో లభిస్తుందని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గంధంగూడలోని శ్రీ జ్ఞాన వెంకటేశ్వర స్వామి దేవాలయ వార్షికోత్సవ కార్యక్రమాలు మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దేవాలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేయర్ మహేందర్‌గౌడ్, డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయండి

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్ నుంచి దర్గా ఖలీజ్‌ఖాన్‌కు వెళ్లే రోడ్డు పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే ప్రారంభించాలని చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ రంజిత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం రాజేంద్రనగర్‌లోని కిస్మత్‌పూర్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాలనీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు కిస్మత్‌పూర్ రోడ్ సమస్యను ఎంపీ దృష్టికి తీసుకువెళ్లారు. రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని విన్నవించారు. స్పందించిన ఎంపీ రంజిత్‌రెడ్డి మంత్రి కేటీఆర్‌తో మాట్లాడి వెంటనే ప్రారంభమయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, నరేందర్, విష్ణువర్ధన్‌రెడ్డి, ధశరథ్, కాలనీ వాసులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కృషి



తారానగర్‌లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ

శేరిలింగంపల్లి: కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ప్రభుత్వ విప్ ఆరెకపూడి గాంధీ తెలిపారు. శేరిలింగంపల్లి తారానగర్‌లో సుమారు రూ 60 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు స్థానిక కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్‌తో కలిసి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఈఈ శ్రీనివాస్, ఏఈ సునీల్ మాజీ కౌన్సిలర్లు వీరేశంగౌడ్, మోహన్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు మల్లికార్జున శర్మ, హబీబ్, కవిత, గోపాలకృష్ణ, జనార్ధన్‌గౌడ్, నటరాజ్, కెఎస్‌రాములు తదితరులు పాల్గొన్నారు. అలాగే శేరిలింగంపల్లి ఆదర్శనగర్‌లో రూ 7 లక్షల వ్యయంతో నిర్మించనున్న మంచినీటి పైప్‌లైన్ పనులకు ఎమ్మెల్యే గాంధీ శంకుస్థాపన చేశారు.

వరద సమస్యకు పరిష్కారం

గచ్చిబౌలి: కాలువల నిర్మాణంతో వరద నీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. మంగళవారం కొండాపూర్ డివిజన్ పరిధిలో రూ.1.47 కోట్ల నిధులతో అంజయ్యనగర్, నెక్టార్ గార్డెన్‌లో రెండు వరద నీటి కాలువలు, మార్తాండనగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ షేక్ హమీద్ పటేల్, మాజీ కార్పొరేటర్ నీలం రవీందర్ ముదిరాజ్, నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, ఊట్ల కృష్ణ, నర్సింహ్మాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

గుర్రపుడెక్క తొలగింపు పనుల పరిశీలన



శేరిలింగంపల్లి: చెరువులు, కుంటల్లోని గుర్రపుడెక్కను త్వరితగతిన తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ సూచించారు. గోపీనగర్‌లోని చెరువులో గుర్రపుడెక్కను తొలగింపును ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువులో గుర్రపుడెక్క పెరగడంతో పరిసర ప్రజలు దోమల బెడదతో అవస్థలు పడుతున్నారని ఆ సమస్య తీరుతుందన్నారు. కార్యక్రమంలో నీటి పారుదల శాఖ డీఈ నళిని, నాగేందర్ నాయకులు యాదాగౌడ్, గోపాల్‌యాదవ్, బస్వరాజ్, రవీంద్రరాథోడ్, కుటుంబరావు, నర్సింహ్మ, దినేష్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఆర్ట్ సాక్-2023

- హెచ్‌సీయూ ఆధ్వర్యంలో నిర్వహణ
- ఆర్టిస్టులు, ఆర్ట్ లవర్స్ కోసం ఔట్‌రీచ్ ప్రోగ్రామ్



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్ట్‌సాక్-2023 అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. ముఖ్యంగా ఆర్టిస్టులు, ఆర్ట్ లవర్స్ కోసం ఔట్ రీచ్ ప్రోగ్రామ్‌ను నిర్వహించారు. ఈ మేరకు హెచ్‌సీయూ పీఆర్ఓ ఆశిష్ జాకబ్ థామస్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. హెచ్‌సీయూ ఆధ్వర్యంలో అబిడ్స్‌లోని సిటీ క్యాంపస్ గోల్డెన్ థ్రెషోల్డ్‌లో 'ఆర్ట్ సాక్ -2023' పేరిట నిర్వహించారు. అరబిక్ పదం 'సాక్' అంటే 'బజార్' అని అర్థం. ఈ కార్యక్రమాన్ని హెచ్‌సీయూలోని ఫైన్ ఆర్ట్స్ డిపార్ట్‌మెంట్ సరోజినీనాయుడు స్కూల్ ఆఫ్ ఆర్ట్ అండ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పెయింటెడ్ టెర్రకోట ప్లాటర్ నుంచి వెల్డెడ్, టెర్రకోట శిల్పాలు, జైన్‌ల నుంచి ఆభరణాల వరకు అన్నింటిని ప్రదర్శించారు. దీంతోపాటు క్యాలెండర్లు, బ్యాగ్‌లు, స్కార్ఫ్‌లు, కుండలు, మార్బుల్ ప్రింటింగ్, బ్లాక్ ప్రింటింగ్‌తో సహా వివిధ కళాత్మక పద్ధతులతో చేతితో తయారు చేసిన వస్తువులు ఉంచారు. యానిమేటెడ్ ఫిల్మ్ ప్రదర్శించారు రుచికరమైన వంటకాలు, పానీయాలు కూడా అందుబాటులో ఉంచడంతో సందర్శకులు ఎంజాయ్ చేశారు. కార్యక్రమంలో పలువురు ప్రొఫెసర్లు, విద్యార్థులు, సందర్శకులు పాల్గొన్నారు.



ప్రజల నీటి కష్టాలను తీర్చండి



రాజేంద్రనగర్ జలమండలి కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న కార్పొరేటర్ మోండ్ర సంగీతగౌరీశంకర్, నాయకులు

రాజేంద్రనగర్: అత్తాపూర్ డివిజన్ ప్రజలు మంచినీటి సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమవుతున్నారని డివిజన్ కార్పొరేటర్ మోండ్ర సంగీతగౌరీశంకర్ అన్నారు. మంచినీటి సమస్యలను పరిష్కరించాలని మంగళవారం రాజేంద్రనగర్ జలమండలి కార్యాలయం ముందు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. నీటి సమస్యలపై అధికారులు చర్యలు తీసుకోవాలని ప్లకార్డుల ప్రదర్శన నిర్వహించి జలమండలి జనరల్ మేనేజర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి రాచూరి రాజశేఖర్, బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సులిగే వెంకటేష్ పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను ఉపయోగించుకోవాలి



కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, వైస్‌చైర్మన్ గోపాల్

శంషాబాద్: ప్రతి ఒక్కరు తప్పకుండా కంటి వెలుగు వైద్య శిబిరాలను సద్వినియోగపర్చుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ సూచించారు. మంగళవారం పట్టణంలోని పద్నాల్గో వార్డులో వైస్‌చైర్మన్ బండిగోపాల్ యాదవ్‌తో కలిసి కంటివెలుగు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కంటి జబ్బులను నిర్లక్ష్యం చేయరాదన్నారు. మున్సిపల్ కమిషనర్ భోగీశ్వర్లు, వైద్యురాలు దివ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు వైద్య పరీక్షలు చేసుకోవాలి

మణికొండ: అన్ని రంగాల కార్మికులు వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోకాపేట కౌన్సిలర్ జి.శివారెడ్డి అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ కోకాపేటలో మంగళవారం కార్మిక శాఖ తరపున ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు ప్రభుత్వం తరచూ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేయటంతో వారికి ఎంతో మేలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు విశ్వనాథ్, డాక్టర్లు సంజయ్, సాయి శంకర్, ప్రవీణ్‌లు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ శివారెడ్డి

రైల్వే లెవెల్ క్రాసింగ్‌ను తెరిపించాలి

శంషాబాద్ రూరల్: మండలంలోని పిల్లోనిగూడ, పాల్మాకుల మధ్యలో ఉన్న రైల్వే లెవల్ క్రాసింగ్‌ను వెంటనే తెరిపించడంతో పాటు ప్రత్యామ్నాయ చర్యలపై దృష్టి పెట్టాలని ఎంపీ రజింత్‌రెడ్డి మంగళవారం దక్షిణ మధ్య రైల్వే ఇంచార్జి జీఎం అరుణ్‌కుమార్ జైన్‌ను కోరారు. ఎమ్మెల్యేలు టి.ప్రకాష్‌గౌడ్, అరికపూడి గాంధీ, స్థానికులతో కలిసి రైలు నిలయంలో ఇంచార్జి జీఎంకు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఉందానగర్-తిమ్మాపూర్ రైల్వే స్టేషన్‌ల మధ్యలో ఉన్న ఈ రైల్వే ట్రాక్‌పై పిల్లోనిగూడ సమీపంలో లెవెల్ క్రాసింగ్‌ను రెండు నెలల కిందట మూసి వేయడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఇక్కడ ప్రత్యామ్నాయంగా వంతెన లేదా అండర్‌పాస్ నిర్మించాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు నర్సింహా, రవినాయక్, తదితరులు పాల్గొన్నారు.



దక్షిణ మధ్య రైల్వే ఇంచార్జి జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి తదితరులు

బీఆర్ఎస్‌కు రోజులు దగ్గరపడ్డాయి



కొత్వాల్‌గూడలో కాంగ్రెస్ జోడో యాత్ర

శంషాబాద్: అరాచక పాలన సాగిస్తున్న బీఆర్ఎస్‌కు రోజులు దగ్గరపడ్డాయని పీసీసీ కార్యదర్శి జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పి. సంజయ్‌యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం ఎయిర్‌పోర్టు కాలనీ, కొత్వాల్‌గూడలో హాత్ సే హాత్‌జోడో యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్‌తోనే సుపరిపాలన సాధ్యమవుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజలను బీఆర్ఎస్ దగా చేసిందన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా రేపరేపలాడనుందన్నారు. కార్యక్రమంలో పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేదర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడతాం

- బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్



అంజయ్యనగర్‌లో కరపత్రాలను ఇస్తున్న రవికుమార్‌యాదవ్, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

గచ్చిబౌలి: కబ్జాకోరల్లోని ప్రభుత్వ భూములను కాపాడి తీరుతామని బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ స్పష్టం చేశారు. కొండాపూర్ డివిజన్‌లోని అంజయ్యనగర్‌లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డితో కలిసి గడపగడపకూ బీజేపీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నా పట్టించుకునేనాథుడే కరువయ్యారన్నారు. శేరిలింగంపల్లిలోని ప్రభుత్వ భూములన్నీ కాపాడి తీరుతామని స్పష్టం చేశారు. పాదయాత్రలో పలు సమస్యలు తమ దృష్టికి వచ్చాయని వాటన్నింటినీ దశలవారీగా పరిష్కరించేందుకు చొరవ తీసుకుంటామన్నారు. మన్యంకొండ, చెన్నయ్య, కృష్ణ, క్రాంతికుమార్, కిషన్ , భాస్కర్‌రెడ్డి, చందర్, రాంరెడ్డి, అనీల్‌కుమార్‌యాదవ్, చంద్రశేఖర్ యాదవ్,ఎల్లేష్,హన్మంతునాయక్, నవీన్‌రెడ్డి, పార్వతి, పద్మ పాల్గొన్నారు.

ధ్యానంతో ఒత్తిడి దూరం

గచ్చిబౌలి: యోగా, ధ్యానం ద్వారానే ఒత్తిడి దూరమవుతుందని బ్రహ్మకుమారీస్ డాక్టర్ అదితి సింఘాల్ పేర్కొన్నారు. మంగళవారం కొండాపూర్ టీఎస్ఎస్‌పీ 8వ బెటాలియన్‌లో ఎమోషనల్ వెల్ బీయింగ్ (మానసిక శ్రేయస్సు) అనే అంశంపై ప్రసంగించారు. పని ఒత్తిడిలో ఉన్న వారు యోగా చేయాలని సూచించారు. కొండాపూర్ బెటాలియన్ కమాండెంట్ పి.మురళీకృష్ణ మాట్లాడుతూ పని ఒత్తిడిలో ఉన్న పోలీసులు నిత్యం యోగా చేయాలని, మంచి జీవన విధానాన్ని అలవరుచుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్లు సింగ్, గంగారం, అసిస్టెంట్ కమాండెంట్లు రెహమాన్, నర్సింహస్వామి, సత్యనారాయణ, బీకె అరుంధతి పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న డా.అదితి సింఘాల్

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9553955684
9010221230